**Assembles Of The Living Elohim(1.Tim 3:15), India Presents.................**

**SATYAMUNAKAI PORATAM** REGD. NO. 67970/97 **REGD. MONTHLY NEWSPAPER**

# సత్యమునకై పోరాటం

**Postal Regd. No. H/APM/01**
**Valid upto December 2008**
Posted on 30th of Every Month
Annual Subscription Rs.50/-

To
Bro./Sis,




Editor & Publisher : **Bro. Isaac E. Kusuma,**
**MALIKIPURAM** - 533 253
E.G.Dt. (A.P.) India
E-mail : iek_personal@sancharnet.in
Phone : 08862-227613
Cell : 98493-85038

VOLUME : 10 | Zif- Sivan 5768[May 2007] | Pages : 4 | Issue : 113

**Warning:** This Newspaper is strictly intended for TRUTH SEEKERS only, not for any denominational Christians

# నిజమైన యావె సేవకుడు అందరికీ మంచివాడు కాడు కాలేడు

– ప్రవక్తయైన ఏలియాను సారెపతు విదవరాలు యావెజనుడా! (1 రాజులు 17:18,24) అని సంబోధిస్తుంటే, ఇశ్రాయేలు రాజైన ఆహాబు మాత్రం ఇశ్రాయేలు వారిని శ్రమపెట్టువాడవు నీవే కావా? (1 రాజులు 18:17), నా పగవాడా, నీ చేతిలో నేను చిక్కబడితినా? (1 రాజులు 21:20) అని అంటున్నాడు.

– ప్రవక్తయైన మీకాయాను యూదారాజైన యెహోషాపాతు యావె ప్రవక్తగా (1రాజులు 22:7) గుర్తిస్తుంటే, ఇశ్రాయేలు రాజైన ఆహాబు మాత్రం తనకు మేలు ప్రకటింపక కీడు ప్రకటించుచున్నాడని అతనిపై ద్వేషము (1 రాజులు 22:8) పెంచుకుని 400 మంది అబద్దబోధకులతో అబద్ధములను వింటూ కాలము గడుపుచున్నాడు.

– బాప్తిస్మమిచ్చే యోహానుని ప్రజలు, సుంకరులు, ఎలోహీం దూతగా గుర్తించి పాపములు ఒప్పుకొని బాప్తిస్మములు పొందుచూ సత్యమైన మార్గములో జీవించడాన్కి ప్రజలు ఆయుత్తపడుతుంటే (మత్తయి 3:5, మార్కు 1:4,5, లూకా 3:3–6+10–18,లూకా 7:29) భక్తి మర్యాదలు గల పరిసయ్యులు, సద్దూకయ్యులు మొ॥గు తెగలవారు అబ్రహాము మా తండ్రి, నీవెవడవు అన్నట్లు (మత్తయి 3:7–10, లూకా 3:8–9) మాట్లాడుచూ ,వాదించుచూ, స్వనీతి ప్రదర్శించుచూ, బాప్తిస్మము పొందక వారి విషయమై ఎలోహీం సంకల్పమును నిరాకరించిరి (లూకా 7:30). ఇక ఆదేశమును పరిపాలించు రాజు యొక్క సకల దుష్కార్యములను ఖండించుచున్నందునను (లూకా 3:19,20), అతని గద్దించుచున్నందున చెరసాలలో వేయించెను. వ్యభిచార మనస్సుతో కళ్ళుపొరలు కప్పిన రాణియైన హేరోదియ అయితే అతనిపై పగబట్టి అతనిని చంపించేంతవరకూ నిద్రపోలేదు (మత్తయి 14:3–11). మండుచూ ప్రకాశించుచున్న దీపమైన (యోహాను 5:35) యోహానును ఆర్పివేసేవరకూ భక్తి రూపంలో ఉన్న పరిసయ్యులు, సద్దూకయ్యులు, ధర్మశాస్త్రోపదేశకులు + రాజకీయ నాయకుల్లాంటి రాజు, వారి పాపపు అధికారంతో అతనిని లేకుండా చేసేసారు.

– సేన దయ్యం పట్టి పీడించబడుచున్నవాడు (మార్కు 5:1–20) యషువ మెస్సీయను చూచి పరుగెత్తుకొని వచ్చి ఆయనకు నమస్కారము చేసి దయ్యముల బారినుండి విడుదల పొంది బట్టలు ధరించి స్వస్థచిత్తుడై ఆయన యొద్దనే ఉండుటకు ఇష్టపడుతుంటే పందుల కాపరులు మాత్రం మెస్సీయను వారి ప్రాంతములు విడిచి పొమ్మని బ్రతిమాలుకుంటున్నారు (మార్కు 5:13,17).

– అపోస్తలుడైన సౌలు యొక్క బోధ విని ఎఫెస్సీయులు, ఆసియాలోని అనేకులు మెస్సీయకు శిష్యులుగా మారిపోతూ ఉంటే, దేవతల రూపంలో వెండి విగ్రహాలు చేస్తూ లాభం సంపాదించుకుంటూ జీవిస్తున్న కంసాలివాడైన దేమేత్రి బ్రతుకు దెరువు పోతుందని, అనేకులకు ఎంతో చక్కగా సాగే జీవనం పోతుందని, మరియూ దేవతవైపున్న విశ్వాసం తగ్గిపోయి మహాదేవియైన అర్తెమి దేవి యొక్క గుడికూడా తృణీకరించబడిపోయి, ఆమె గొప్పతనం తగ్గిపోతుందని జనసమూహాలను రేపి అల్లరి చేస్తున్నాడు (అ॥కార్య 19:23–41)

– అదే విధంగా పుతోను దయ్యం పట్టిన చిన్నదాని ద్వారా బహులాభం సంపాదించుచున్న యజమానులు, అపోస్తలుడైన సౌలు విషయంలో చాలా కలవరపడిపోయి వారి లాభ సాధనం పోయిందని చాలా శ్రమలకు సౌలును–సీలను గురిచేసారు.(అ॥కార్య 16:16–22) చిన్నది స్వస్థత పొంది బాగుగా ఉన్నది, కాని చిన్నదాని ద్వారా సోదె వ్యాపారం చేస్తున్న యజమానులకు చాలా నష్టం కలిగిందని యావె జనులను బాధించారు, కొట్టారు, చెరసాలలో పెట్టించారు.అపోస్తలుడైన సౌలును బోధకు అనేకులైన మంచి భక్తిపరులు మారిపోయి ఆయనను అనుసరించుచున్నందున యూదులు మత్సరపడి సౌలుకు చాలా హింసలు కలుగచేసారు (అ॥కార్య 17:4)

పై వాక్యములను బట్టి చూస్తే, నిజమైన యావెజనుని ద్వారా ఒకరికి లాభం చేకూరుతుంటే వేరొకరికి నష్టం కలుగుతుంది. నష్టం కలిగినవాడు యావెజనుని బాధిస్తూనే ఉంటాడు. లాభం కలిగినవాడు యావెజనుని వెంబడిస్తూ ఉంటాడు. నిజమైన యావెజనుడు అందుకే అందరికి మంచివాడు కాలేడు.

యషువ మెస్సీయ బోధకు తాళలేని శాస్త్రులు, పరిసయ్యులు, సద్దూకయ్యూలు మొదలగు ధర్మశాస్త్రోపదేశకులు ఆయనను రకరకాలుగా హింసించేవారు, బాధించేవారు, చెడు ప్రచారం చేసేవారు, నిందలు మోపేవారు, నీతిహీనమైన పనులు ఎన్నెన్నో చేస్తూ ఉండేవారు.

– యూదులలో అనేకులు తమవారిని విడిచి యషువనందు విశ్వాసముంచిరి గనుక ప్రధాన యాజకులు లాజరును కూడా చంపనాలోచన చేసిరి (యోహను 12:10).

– వెలివేతలకు భయపడి ఆయనను అనేకులు ఒప్పుకోలేదు. (యోహాను 9:22)

యషువ మెస్సీయ శాస్త్రులవలె గాక అధికారము గల వానివలె బోధించెడివాడు.

**ప్రవక్తలు బోధించినపుడు ఎలా ఉన్నదీ చూద్దామా!**

– ఆ దీర్ఘదర్శి అట్లు ప్రకటించినందుకు ఆసా అతనిమీద కోపగించి రౌద్రము చూపి అతనిని బందీ గృహములో వేసెను(2.దిన 16:10).

– అందుకు వారతని (జెకర్యా) మీద కుట్రచేసి రాజు మాటను బట్టి యావె మందిరపు ఆవరణము లోపల రాళ్ళు రువ్వి అతని చావగొట్టిరి (2.దిన 24:21).

– రాజు అతని (ప్రవక్తను) చూచి – నీవు రాజుయొక్క అలోచనకర్తలలో ఒకడివైతివా? ఊరకొనుము; నేను నిన్ను చంపనేల అని చెప్పగా ...... (2.దిన 25:16 –)

– అతడు తన ఎలోహీం అయిన యావె దృష్టికి చెడునడత నడచుచు, ఆయన నియమించిన ప్రవక్తయైన యిర్మీయా మాట వినకయు, తన్ను తాను తగ్గించుకొనకయు ఉండెను (2.దిన 36:12).

– వారు ఎలోహీం దూతలను ఎగతాళి చేయుచు, ఆయన వాక్యములను తృణీకరించుచు, ఆయన ప్రవక్తలను హింసించుచూరాగా...............(2.దిన 36:16)

– అయితే గుమ్మములో నిలిచి బుద్ధి చెప్పువారిమీద జనులు పగ పట్టుదురు ; యధార్థముగా మాటలాడు వారిని అసహ్యించుకొందురు (ఆమోసు 5:10).

**యషువ మెస్సీయ, అపోస్తలులు ఎలాంటి బోధకులు** ?

యషువ మెస్సీయ మోమాటం ముఖస్తుతిలేని బోధకుడు : – బోధకుడా ! నీవు సత్యవంతుడవై యుండి, ఎలోహిం మార్గమును సత్యముగా బోధించుచున్నావనియు, నీవు ఎవనిని లక్ష్యపెట్టవనియు, మోమాటము లేనివాడవనియు ఎరుగుదుము మత్తయి 22:16. ఆది అపోస్తలులు కూడా మెస్సీయ వంటి బోధకులే ; వాక్యం బోధించుటలోను, వివరించుటలోను, ఖండించుటలోను, హెచ్చరించుటలోను, గద్దించుటలోను అధికారం కలిగి చేసారు. గనుకనే వారి బోధ వినగానే ప్రజలు ముఖ్యంగా వాక్యమునకు వ్యతిరేక స్వభావము గలవారు హృదయమందు నరకబడినారు (అ॥కార్య॥ 5:33, 7:54) అందుకే అపోస్తలుల మాటలు వినగానే, అత్యాగ్రహము తెచ్చుకున్నారు (అ॥కార్య 5:33), కోపముతో మండిపడిపోయారు (అ॥కార్య 7:54) నేడు ఏమి ఉన్నది? అంతా పాలిష్ బోధ,అంతా అనుకూల బోధ, అంతా మోసపు బోధ, అంతా దొంగ బోధ తప్ప నిజమైన బోధ ఏది? నిజమైన బోధకుడు ఎక్కడున్నాడు? (బోధను గూర్చిన పూర్తి వివరములు కావలసినచో **"బోధంటే ఏమిటి? ఎలా?"** అనే పత్రిక కొరకై వ్రాయండి)

సత్య సంబంధి ఎప్పుడూ అబద్దికులకు విరోధే. యావె బోధను అబద్ధమని సాతాను అంటుంది (ఆది 3:1–5). సాతాను ఆదినుండి ఆబద్ధకుడని వాడు అబద్ధమునకు జనకుడని యావె అంటున్నాడు (యోహాను 8:44). సాతానుకు లేఖనాలు లేవు వాడు ఎల్లప్పుడు పరమతండ్రి లేఖనములకు వంకర బాష్యం చెపుతూ ఉన్నాడు. సాతానుకు పొలం లేదు మెస్సీయ పొలంలోనే గురుగులు చల్లుతున్నాడు. సాతానుకు మనుష్యులు లేరు మెస్సీయ చేసిన మనుష్యులనే వాడు పాడుచేస్తున్నాడు. సాతాను వెలుగుదూత (మెస్సీయ) కాడు. కాని వెలుగుదూత వేషం వేసాడు. ఎందరో భక్తులు సాతానుని యావె అనుకొని (2.సమూ 24:1, 1.దిన 21:1) ప్రేరేపించబడిపోయి దయ్యపు కార్యాలు ఆయన నామంలో చేస్తున్నారు. అందుకే మెస్సీయ శిష్యులు సహితం మెస్సీయను చూచి భూతం అని భయపడుతున్నారు (లూకా 24: 36–42) అందుకే క్రైస్తవ భక్తులు సత్యమును అబద్దమని, అబద్ధమును సత్యమని నమ్ముతున్నారు. పైగా పెద్ద వీరాభిమానుల్లా సత్య సంబంధులను చంపడం ఎలోహీంకు సేవ చేయడం (యోహను 16: 1,2) అన్నట్లు భ్రమపడుతున్నారు. **మిమ్మును చంపు ప్రతివాడు తాను ఎలోహీంకి సేవ చేయుచున్నానని అనుకొను కాలము వచ్చుచున్నది. యోహాను 16:2.**

బైబిలు బోధ యెరూషలేం నుండి వచ్చినది. క్రైస్తవ బోధ రోమన్ కేథలిక్ నుండి వచ్చినది. రోమన్ కేథలిక్కులు బైబిలు బోధను మార్చి క్రైస్తవ్యం అన్నారు. కేథలిక్కుల నుండే బయటకు వచ్చిన వారు ప్రొటెస్టంట్సు ; కేథలిక్కుల బోధనే ప్రొటస్టంట్సు అనుసరిస్తూ కేథలిక్కులకు మేము వ్యతిరేకులం అంటే ఎలా కుదురుతుంది? కేథలిక్కులకు – ప్రొటస్టంటులకు ఉన్నతేడా ఏమిటో చెప్పమనండి వీళ్ళు (ప్రొటస్టంటులు) ఎలా సత్యవంతులో ఋజువుచెయ్యమనండి. **కేతలిక్కులు సబ్బాతును ఆదివారంకు మార్చారు. బాప్తిస్మమును చిలకరింపుకు మార్చారు. బైబిలు క్యాలెండరును గ్రెగేరియన్‌కు మార్చారు. నీసాను 14మెస్సీయ మరణదినమును గుడ్‌ఫ్రైడేకు మార్చారు. నీసాను 17 పునరుత్థానమును ఈస్టర్**

**సన్‌డే గా మార్చారు. ఏతనీమ్ 15 మెస్సీయ జన్మదినమును డిశెంబర్ 25 క్రిస్ట్‌మస్ గా మార్చారు. పస్కాను – ప్రభారాత్రి భోజనంగా మార్చారు. అవే సిద్దాంతాలు ప్రొటెస్టంటులు ఆచరిస్తూ సత్యవంతులంటే వాక్యమెరుగని దద్దమ్మలు నమ్ముతారుగాని వాక్యమెరిగిన సత్య సంబంధులు నమ్మరు.** సత్య స్వరూపియైన ఆత్మ వారిని సర్వసత్యములోనికి నడిపించును గనుక అబద్దములను నమ్మరు, బోధించరు. అట్టి అబద్దములలో జీవించేవారిని వాటినుండి బయటకు రమ్మని బోధిస్తారు. అది వారికి కిట్టదు. బాప్తిస్మమిచ్చు యోహాను సూచక క్రియలతోను, అద్భుతములతోను, స్వస్థతలతోను, ఛాలెంజీలతోను రాలేదు గాని యషువ మెస్సీయను గూర్చి చెప్పిన సంగతులన్నియు సత్యమైనవి, సత్యమునకు ప్రాముఖ్యతనిచ్చి బోధించాడు (యోహాను 10:41). యషువ మెస్సీయ కూడా సత్యమును బోధించాడు. సత్యసంబధియైన ప్రతివాడు నామాట వినునని చెప్పాడు (యోహాను 18:38) సత్యమును గూర్చి సాక్ష్యమిచ్చుటకే ఆయన పుట్టాడు (యోహాను 18:37).

ఇప్పుడు బోధకులనబడిన వారు సత్యమును సంతలో పడవేసి, సువార్త అంటూ సూచక క్రియలు/అద్భుతాలు/స్వస్థతలు/ సోదె మొదలెట్టి ప్రజలను మోసగించుచున్నారు. సత్యము ఎవరికీ అవసరలెద్దు, సత్యమైన నామము అవసరలెద్దు, సత్యమైన బోధ అక్కరలేద్దు, అన్నీ అబద్దాలే కావాలి, అనుకూలమైన రోజులు కావాలి, అనుకూలమైన బోధ/బోధకులు కావాలి, సత్యమునకు అసలు చెవి యొగ్గటం లేదు, పారం పర్యాచారమునకు, మిషను బోధకు అలవాటు పడ్డారు గనుకనే క్రైస్తవ్యం కొన్ని వందల మతశాఖలుగా విడిపోయి ఎవడి ఇష్టం వాడు నెరవేర్చుకొంటున్నారు న్యాయాధి 21:25. రాజులేని రాజ్యం, గురువు లేని భక్తి. మహాస్వేచ్ఛకు అలవాటుపడిపోయి ధర్మ శాస్త్రమే లేదంటున్నారు. అంతా అధర్మశాస్త్రమునకే కట్టుబడి ఉన్నారు. డబ్బు ఉన్నవాడెల్లా ఒకొక మిషన్ కట్టేసి వాడు అధికారం చలాయించుచున్నాడు. పేరు మాత్రమే ఆయనది ఆధికారం అంతా మిషన్ హెడ్‌దే.డబ్బుకి బోధకులు బానిసలై సత్యమును అసత్యమునకు మార్చి దొంగలుగా తయారయ్యారు. బోధకుల దోషం అనుసరించి విశ్వాసులు అంధులై తిరుగులాడుతున్నారు (విలాప 4:13) ప్రజలను పొగుడుచూ, లాలించుచూ, పబ్బం గడుపుతున్నారే గాని చెరలోనికి పోకుండా దోషములను వెల్లడిచేయడం లేదు (వి॥వా 2:14).

ఒక విశ్వాసి ఏమన్నాడో తెలుసాండీ! మా పాస్టర్ తప్పుచేస్తే అతను నరకాన్కి వెళతాడు మేమెందుకు వెళతాము? అన్నాడు.

1. గుడ్డివాడు గుడ్డివానికి దారిచూపితే ఇద్దరూ గుంటలో పడతారని ఉంది. గాని ఒక్కడే పడతారని లేదు గదా? (మత్తయి 15:14)
2. పషూరూ! నీవును నీవు ప్రవచనములచేత మోసపుచ్చిన నీ స్నేహితులందరూ బబులోను నకు వచ్చెదరు; అక్కడనే చనిపోయెదరు అక్కడనే పాతి పెట్టబడెదరు (యిర్మీయా 20:6) (ఇక్కడ యాజకుడొక్కడే చావడం లేదు వాడి ద్వారా మోసపోయిన వాడి జనాంగం కూడా)
3. మంటి గోడ కట్టిన వాడును దానిపై పూత పూసిన వాడునూ నాశన మవ్వుచున్నారు. చదవండి యెహెజ్కేలు 13:10–16
4. శాపగ్రస్తులు + సాతాను గాడు ఇద్దరూ నరకాగ్నికి పోవలసిందే; మత్తయి 25:40
5. పులిసినపిండి లాంటి బోధకుడంటే వాడి సంఘమంతా పులిసిన విశ్వాసులే గదా? కాదా?
6. జారిణిని, దానితో వ్యభిచరించువాని, దాని పిల్లలను పరమతండ్రి నాశనంచేస్తానంటున్నాడు. (ప్రకటన 2:20–23)
7. అబద్దమాడిన భర్త అతనికి సహకరించిన భార్య ఇద్దరూ చనిపోలేదా? అ॥కార్య 5:11

విశ్వాసులలో ఒక భయంకరమైన వ్యాధి ఉంది. అదే వారి బోధకులను అభిమానించడం, ఇతర బోధకులను తృణీకరించడం ఇది చాలా నీచమైన కార్యం. ఒకసారి ఒక ప్రదేశమునకు వెళ్ళాను నన్ను చూడగానే ఒకతను "మీరా! ఐజక్ కుసుమ గారు, మీ గూర్చి నాకంతా తెలుసు" అన్నాడు. అప్పుడు నేనడిగాను అతనిని "నా కెంత మంది భార్యలో చెప్పు" అని. నాకు తెలియదు అన్నాడు. పోనీలే "నీవు అభిమానించే నీ బోధకునికి ఎంత మంది భార్యలో చెప్పు" అన్నాను. అతనికి తెలుసు అతను అభిమానించే వ్యక్తికి ఎంత మంది భార్యలున్నారో, కాని అది చెప్పదు అది కప్పివేస్తాడు. నా మీద బురద చల్లడాన్కి మాత్రం సిద్దం. ఇది విశ్వాసుల తంతు. అందుకే ఎలీషాప్రవక్త ఏమంటున్నాడో చూద్దామా! అయితే చదవండి 2. రాజులు 3:13 **"నీ తల్లిదండ్రులుంచుకొనిన ప్రవక్తల యొద్దకు పొమ్మని చెప్పెను"** అటులనే ఈ వాక్యం కూడా చూడండి. **"నాకు అనుకూలులు కాని రాజులను వారు నియమించుకొని యున్నారు, నేనెరుగని అధిపతులను తమకుంచుకొనియున్నారు"** హోషేయ 8:4. విశ్వాసులు సత్యమునకు చెవి యివ్వక సోదెగాళ్ళను ఉంచుకున్నారు. ఎందుకనగా జనులు హితబోధను సహింపక, దురదచెవులు గలవారై తమ స్వకీయదురాశలకు అనుకూలమైన బోధకులను తమ కొరకు పోగుచేసుకొని, సత్యమునకు చెవినియ్యక కల్పనా కథలవైపునకు తిరుగుకాలము వచ్చును (2.తిమోతి 4:3,4). విశ్వాసులు ఎవరికి కావలసిన బోధకులను వారుపోగుచేసుకుని ఉంచుకునే ఉన్నారు. అసలు బోధకుడైన మెస్సీయను వాళ్ళ సంఘాలనుండి ఏనాడో తరిమి బయటపెట్టారు. అందుకే గదా మెస్సీయ "ఇదిగో నేను తలుపునొద్ద నిలుచుండి తట్టుచున్నాను" అని ప్రకటన 3:20లో అంటున్నాడు. డినామినేషన్లు, మిషన్లు, గ్రూపులు అన్నీ మెస్సీయకు తలుపు మూసే ఉంచారు. ఏ డినామినేషన్ వాడికి వాడే తలుపు తీయనిరోజుల్లో ఉన్నాం. ఇక ఎదుట డినామినేషన్ వాడికి తలుపు తీసేదెవరు? అందుకే ఈ డినామినేషన్ అన్నింటినీ వాక్యంతో పగలగొట్టవలసిన గడియ ఆసన్నమైనది. సత్యము ఎప్పుడూ అబద్దంపై యుద్దం చెయ్యాల్సిందే. **"సత్యమేవ జయతే"** అన్నారు పెద్దలు. ఏనాటికైనా సత్యమే జయించాలి. అయితే: "సత్యమైనది దూరముగాను, బహులోతుగాను ఉన్నది. దానిని పరిశీలన చేయగలవాడెవడు" అని ప్రసంగి 7:24 అంటుంది. పరిశీలకులు కావాలి అందరు చెప్పేది వినాలి. ఏది సత్యమో ఏది వాక్యసమ్మతమో పరిశీలించాలి. కాని బోధకులు విశ్వాసులను పరిశీలనుకు పురికొల్పడం లేదు గాని వాళ్ళ సంఘాలనుండి బయటకువెళ్లిపోతారేమోననే భయంతో కులకట్లు, మిషన్‌గట్లు, కట్టుకొని మాట్లాడుతున్నారు. వాటిని తెంచుకుని బయటకు వచ్చేవరకు విశ్వాసులకు సత్యము తెలియదు. జ్ఞానము లేనివారు ప్రతీమాటనూ నమ్ముతారు. నమ్మకం ఎక్కడ ఉన్నదో మోసం కూడా అక్కడే ఉంది. మోసపోవడాన్కి గల కారణం నమ్మకంలో పొరపాటు ఉండడమే. గుడ్డిగా నమ్మినా మనం మోసపోక తప్పదు. నేను నా చిన్నతనం నుండి క్రైస్తవ బోధకులను వారి బోధలను పరిశీలిస్తూ ఉన్నాను. వారు చెప్పేదానికి వ్యతిరేకమైన వాక్యం ఏమైనా చూపించినా, లేక వారి సంఘ సిద్ధాంతమును తప్పు అనినా దిద్దుకోవడాన్కి యిష్టపడరు గాని ద్వేషించడాన్కి చూస్తారు లేకపోతే సాతానని ప్రచారం చేస్తారు.

విశ్వసించిన వారందరును ఏక హృదయమును ఏకాత్మయు గలవారైయుండిరి అని అ॥కార్య 4:32 చెప్తుంది. ఏది ఆ ఏకహృదయము,ఏది ఆ ఏకఆత్మ? మనుష్యులు ముఖ్యంగా నాయకులు / బోధకులు / పాస్టర్లు / కాపర్లు / సువార్తికులు స్వార్ధానికి విడిపోయి రక రకాల డినామినేషన్లు తయారుచేసారు. ఎవరి ఇష్టం వారు నెరవేర్చుకోవడం కోసం మిషన్లు స్థాపించుకున్నారు. అందుకే ఎవరిసేవ వారిది అంటున్నారు. విశ్వాసములో ఉన్న లోపమును (1.థెస్స 3:9 ) సరిదిద్దుకొనుటకు ఎవరూ ఇష్టపడడంలేదు. పైగా సత్యమును చెప్పేవారిని అబద్దికులని/ సాతానులని ప్రచారం చేస్తున్నారు. బైబిల్లో బేసిక్ నాలెడ్జి లేనివారు సహితము ఇతరులను అబద్దబోధకులనడం చాలా నీచంగా ఉంది. పెద్ద పెద్ద గొప్ప గొప్ప బోధకులుగా పిలవబడుచూ / నటించుచున్న వాళ్ళ దగ్గర సత్యములేదు గాని సోదె ఎక్కువగా ఉంది. **నేను ప్రాక్టికల్‌గా సత్యాన్వేషణ చేసాను ఆంధ్రాలో సత్యమును బోధించే బోధకుడు ఒక్కడు కూడా నాకు ఇంతవరకు కనబడలేదు.** ఏవో కొన్ని విషయాలు సత్యము బోధించినా మిగతావన్నీ అబద్దాలే: అబద్దములను మాత్రం బోధించడం మానడంలేదు. ఇట్టి అబద్దములు బోధించక పోతే ప్రజలు వారి యొద్దకు సమూహములుగా రారు అనే భయంతోనే వారు అబద్దములను సమర్ధించుచున్నారు.

ఒక డినామినేషన్ వీరాభిమాని "మేము మీటింగ్స్ ఏర్పాటుచేసాం మా సభలకు 20వేల మందికి పైగా జనం వచ్చారు అన్నాడు". అందులో ఎవరైనా ఆది అపొస్తులుల సిద్ధాంతము ననుసరించి యషువ మెస్సీయ నామంలో బాప్తీస్మం పొందినవారు ఒక్కరైనా ఉన్నారా? అని అడిగాను. పోని ఆది అపోస్తులుల సిద్దాంతము ననుసరించి సబ్బాతు పాటించేవారెవరైనా ఉన్నారా? బైబిల్ పండుగలు చేసేవారు ఉన్నారా? అని అడిగితే సమాధానం లేదు. బోధించేవాడే అనుసరించనపుడు వినేవార్కి ఏమి తెలుస్తుంది?

**యషువ మెస్సీయకు బహుజనసమూహముతో పని లేదు చదవండి** యషువ మెస్సీయ జనసమూహములను ఎప్పుడూ పిల్టర్ చేస్తూ ఉండేవాడు.

1. బహుజన సమూహములు వెంబడిస్తూ వెనుక వస్తుంటే రావద్దు అని చెప్పాడు. లూకా 14:25
2. జనసమూహములు మీద పడుతున్న పట్టించుకోలేదు గాని, విశ్వాసముతో తన చెంగు ముట్టిన స్త్రీని గూర్చి మాత్రమే ఆయన మాట్లాడాడు. లూకా5:25–34
3. జనసమూహములను పిలిచి ఏమిచెప్పాడో మీరే చదవండి మత్తయి 15:10,11
4. జనసమూహములో ఒకనిని మాత్రమే బాగుచేసాడు మత్తయి 17:14–22
5. బహుజనసమూహము ఆయనను వెంబడించుచున్ననూ త్రోవప్రక్కన కూర్చున్న ఇద్దరు గుడ్డివాళ్ళ కళ్ళు మాత్రమే తెరిచాడు. మత్తయి 20:29–34
6. జనసమూహముతో ఆయన ఏమి చెప్పాడో చదవండి మత్తయి 23:1
7. జనసమూములో నుండి ప్రక్కకు తీసుకెళ్ళి బాగుచేసిన వ్యక్తిని గూర్చి చదవండి మార్కు 7:33–37
8. జనసమూహముల మధ్య బాగోతం ఎలా ఉంటుందో అదీ చదవండి. మార్కు 9:14–20
9. జనసమూహముల మధ్య జరుగుతున్న పని చూడండి లూకా 5:18 –26
10. స్వస్థతల కోసం పరుగెడుతున్న జనసమూహమును కూడా చూడండి (వీరు పరలోకం కోసం కాదు వాక్యం కోసం అంతకన్న కాదు) లూకా 6:17–19
11. ఆయనను చంపడాన్కి చూచినపుడు కూడా జనసముహములు కత్తులు గుదియలు పట్టుకొని ఎలా వచ్చారో అదీ చూడండి మత్తయి 26:47.జనసముహములను గూర్చి బైబిల్ చదివితే మనకు చాలా తేటతెల్లంగా అర్ధం అవుతుంది. మెస్సీయ జనసమూహములకు ప్రాధాన్యత యివ్వలేదు. జనసమూహములలో విశ్వాసం గలవారిని బాగు చేసాడు. ప్రజలు ఎక్కడికైనా పరుగెడతారు, ఎందుకు పరుగెడుతారో, ఎందుకు కూడుకుంటారో వాళ్ళకే తెలియదు (అ॥కార్య 19:32).

మీరు జాగ్రత్తగా బైబిల్‌ను పరిశీలిస్తే పరలోకరాజ్య ద్వారము చాలా ఇరుకు. సాతాను మార్గం విశాలమైనది. ఈ విశాల ప్రపంచంలో విశాలమార్గం ఏర్పాటుచేసి దాని మీద కుర్చున్న ఒక వేశ్య కలదు ప్రకటన 17వ అధ్యాయం. ఈ మార్గం తెలియనివారికి బైబిల్ అర్ధం కానట్లే లెక్క. " విస్తార జలముల మీద కూర్చున్న మహవేశ్య" ఈ విస్తారజలము 17:15 చదవండి మీకే తెలుస్తుంది. ఈ జనసమూహం అంతా సాతానుది. డినామినేషన్స్ అన్నింటికీ ఇదే హెడ్ దాని పిల్లలు మతశాఖలు (ప్రకటన 2:20–23) సత్యమునకు ఎప్పుడూ వ్యతిరేకమే పేరు మాత్రం మెస్సీయాది బ్రతుకంతా దానిదే (యెషయా 4:1) దాని సిద్ధాంతములను వెంబడించువారెవరూ పరలోకం వెళ్లరు. అది ఎప్పుడూ పరిశుద్ధులతో వైరము కలిగి జీవిస్తూ ఉంటుంది. అందుకే సత్యమునకు అసత్యమునకు ఎప్పుడూ వైరమే కలుగుతుంది.గిద్యోను ఒకసారి యుద్ధమునకు 32,000 మందిని ప్రొగుచేసాడు. పిరికి వాళ్ళు 22,000 మంది వెనక్కిపోగా, 10,000 మంది మిగిలారు. వాళ్ళని కూడా శోధించగా 300 మంది మిగిలారు. 9,700 మంది కూడా పనికి రాకుండా పోయారు (న్యాయధి 7:2–7). గనుక పరమ తండ్రికి జనసమూహములతో పనిలేదు. తనకు పనికివచ్చే ముఖ్యమైన వారే అవసరం. ఎవరు ఇద్దరు – ముగ్గురు నానామంలో కూడుకుంటారో వారి మధ్య ఉంటానన్నాడు, చిన్నమందా భయపడకుడి అన్నాడు, ఇరుకు ద్వారమున ప్రవేశించువారు కొందరే అని అన్నాడు. గనుక, సత్యసంబంధులు చాలా తక్కువ మంది ఉంటారు. వారు జనసమూహములను చూచి అది అంతా పరమ తండ్రి సమూహమే అని భ్రమపడరు.

పరమతండ్రి మనుష్యులను యదార్ధవంతులుగా పుట్టిస్తే (ప్రసంగి 8:29) మనుష్యులు వివిధమైన తంత్రములు కల్పించుకొని, అహంకారం, గర్వం, స్వనీతి, ప్రదర్శిస్తూ పరమ తండ్రి మార్గమునే న్యాయం

కాదు అనే స్తితికి వచ్చారు (యెహె 19:25). సత్యమును బోధించే వారిపై యుద్ధం ప్రకటిస్తున్నారు. పరమతండ్రి గాయపరచని నీతిమంతులను (యెహె13:20) వీరి అబద్ధముల చేత గాయపరుస్తున్నారు.

ఒకసారి ఒక పెద్దబోధకునితో మాట్లాడుతూ ఉండగా, చాలా విషయాలు మాట్లాడి ఇక సమాధానం చెప్పలేక **"మీ సేవ మీరుచెయ్యండి - మా సేవ మేము చేస్తాం"** అన్నాడు. అలాగని బైబిలు చెప్పలేదే? మీసేవ–మాసేవ అనే తేడా ఎందుకు వస్తుంది? అని అడిగితే మాట్లాడడు. బోధకులు యషువ మెస్సీయకు దాసులు కారు మిషను బానిసలు; మిషను రూల్సు రెగ్యులేషన్స్ ఒకవైపు, వాక్యాన్ని వేరొకవైపు ఎలా సేవించగలరు? అందుకే వారి డినామినేషన్సుకు బానిసలుగా బ్రతుకుతున్నారు. బయటకువచ్చి బ్రతకలేరు, లోపలవుండిఎవరైనా వారిని ఖండిస్తే తట్టుకోలేరు. ఇది వాళ్ళ నిజస్వరూపపు బ్రతుకు, యుద్ధంచేయడానికి చూస్తారు. బలహీనులతో వాదిస్తారు. ఎవరైనా బలముగా వాక్యం చెప్పగలిగే వారితో కడవరకూ మాట్లడరు. ఎందుకంటే వాళ్ళుకడవరకూ నిలబడరనే సంగతి వాక్యమే ఋజువుచేస్తుంది. (నిర్గమ 7:11, 22, 8:7, 8:18, 9:11, యిర్మియా 15:20, అ॥కార్య 6:9,10) అందుకే మద్యలోనే డ్రాప్ అయ్యిపోతారు. మీరు పిలిచినా పలకరు, మీరు అడిగినా చెప్పరు (యిర్మియా 7:27, లూకా 22:68), యుద్ధారంభంలోనే కూలిపోతారు. (2.సమూ17:9) గొల్యాతులా శరీరం చూపిస్తే (అనుభవంలేకుండా వాక్యాలు చూపిస్తే) ఆత్మానుసారమైన వాడు జడిసిపోడు వడిసెల దెబ్బతో (జీవవాక్యము) నీ అనుభవం లేని వాక్యాలు పటాపంచలయ్యిపోతాయి.

ఒక చిన్న ఉదాహరణ చెప్పనివ్వండి: "అపోస్తలుడైన సౌలు దేరాలుకుట్టి సువార్తచేసాడా?" అనే వ్యాసం చదివిన ఒక ఉద్యోగస్తుడు చాలా బాధపడిపోయి; అ॥కార్య 20:34వ వచనం తీసి సౌలుగారు తన కొరకును, తనతో ఉన్న వారికొరకును కష్టపడ్డారని వాక్యం చూపించాడట ఒక సహోదరికి; వెంటనే ఆ సహోదరి నిజమేకదా! అని మౌనం వహించింది. ఇప్పుడు నేను అడుగుతున్నాను. నీవు నిజంగా ఆ వాక్యప్రకారమే ఉద్యోగంచేస్తుంటే నాకు సమాధానం చెప్పు? నీ జీతమెంత? నీ అవసరాలకు ఎంతఅవసరం? మిగతాది ఏ సహోదరులకు (నీ జీతపనివారికి) ఇస్తున్నావు? దయచేసి నీ డిటైల్స్ నాకు వివరించు. నేను ప్రాక్టికల్ మనిషిని, నోటిమాటలు నమ్మను. క్రియలు నమ్ముతానే గాని వేషంచూసి స్వీట్‌గా మాట్లాడే మాటలు నమ్మిపడిపోయే వ్యక్తిని కాను.

20 సం॥రాల నుండి చాలా మంది భక్తులనబడినవారిని చూస్తున్నాను. అబ్బో! ఎంత గొప్పభక్తి నటిస్తారో ఎరుగనిదికాదు. మా ఏరియాలో **మహాభక్తురాలు** ఒకామె ఉంది. నోటిమాటల్తో అందరిని బోల్తాకొట్టించేస్తాది. క్రియలు మాత్రం అంతాశూన్యమే. ఇక 24 గం॥లు తండ్రిలో గడిపేస్తున్నట్లే, అసలు ఈ లోకంతోనే సంబంధంలేనట్లు మాట్లాడతాది. ఇళ్ళు (ఇల్లుకాదు) కావాలి, బంగారం కావాలి, మంచి ఆహారంకావాలి, చాలావిలువైన బట్టలుకావాలి, కాస్మోటిక్స్ కావాలి, కార్లు, షికార్లు కావాలి, టి.విల్లో సీరియల్స్ కావాలి, అన్నిరకాల పేషన్స్ కావాలి, పరమ తండ్రితనతోనే మాట్లాడేస్తాడనన్నట్లు ఇతరులను చాలా తృణీకరిస్తూ మాట్లాడతాది. ప్రతీది ఆయన చిత్తముతోనే నడిచేస్తున్నట్లు కబుర్లు ఒలకబోస్తూ ఉంటాది. బైబిల్ బేసిక్ ఎలిమెంట్స్ తెలియక పోయినా, తనకే అంతా తెలుసన్నట్లు తెగనటిస్థాది. ఒకరకంగా మహా అహంకారి, గర్విష్టి. భర్తను ఆడింగివాడిగాచేసి ప్రక్కకునెట్టేసింది. అధికారం అంతా ఆవిడిదే. పిల్లలకు పెళ్ళిళ్ళుచేయాలి గనుక ఇప్పుడు అమ్మగార్కి (యెజెబేలు గార్కి) కట్నాలు కావాలి. కట్నంతీసుకోవడం తప్పు అని పాపం ఈ అమ్మగార్కి పరిశుద్ధాత్మ చెప్పడం లేదేమో? 24 గం॥లూ తండ్రిలోనే గడుపుతున్నానని చెప్పే ఈ భక్తురాలికి కట్నం తప్పు అన్న సంగతి పరిశుద్ధాత్మ బోధించడంలేదా? **పరిశుద్ధాత్మ బోధిస్తుంది కాని అవకాశవాది గనుక ఆ ఆత్మను త్రోసివేసి కట్నాలుకి పరుగెడుతుంది.** "పైగా ఎవరైన ఇది తప్పుకదా?" అని అడిగితే...... "ఎంతో సొమ్ము పెట్టిచదివించాను, దానినంతా రాబట్టుకోవద్దా?" అంటుంది. ఏమిటి ఈ పనికిమాలిన దాని భక్తి? పరమతండ్రి ఆజ్ఞకి విధేయతచూపని ఈ పనికిమాలిన మనిషికి ఉన్న జ్ఞానమేమిటి? (యిర్మియా 8:9) అందుకే ఇలాంటి వేషదారుల మాటలు చూడకూడదు వాళ్ళ క్రియలు ఎలా ఉంటాన్నవో చూడాలి. క్రియల్లో వాళ్ళు ఎంత గౌరవము, మర్యాద, పరమ తండ్రికి ఇస్తున్నారో వివేకులు వాళ్ళని కనిపెట్టాలి. ఈ క్రింది వాక్యాలు చదివి అలాంటి వేషదారులను గమనించండి; (యెహెజ్కేలు 33:31,32, మత్తయి 7:16,20, తీతు 1:16, యాకోబు 2:20, 1యోహాను 3:18, 1యోహాను 2:4)

ఒక్కసారి ఎదో మాటలసందర్భములో యెజెబేలు గార్ని కదిపితే **"శరీరాశ, నేత్రాశ, జీవపుడంబము"** అంటూ సోదె వల్లించింది. మరి **"కట్నం"** దేనిలోకి వస్తుందో? 10 లక్షలు కట్నం వదులుకోవడమంటే ఎంత కష్టమండీ? ఎంత పెట్టుబడి పెట్టామండి మా కొడుక్కి ? మరి కట్నం తీసుకోకపోతే ఎలాగండీ? అని ఎదురు ప్రశ్నిస్తుంది అంటే అమ్మగారు చేసేదంతా కొంగభక్తే గదా! మనుష్యులయెదుట ఎంతో నీతిమంతులుగా (లూకా 16:15) నటిస్తూ, దోమను ఒడియగట్టి ఒంటెను మింగడం (మత్తయి 23:24) అంటే ఇదే మరి. మారు మనస్సులేని వారు, లోకస్తులు కట్నాలకోసం పరుగెడుతున్నారు. వరకట్నాన్ని **"పిచాచి"** అని లోకస్తులు సంబోధిస్తున్నారు. వరకట్నదురాచారమని లోకస్తులు బోధిస్తున్నారు. ఈ లోకసంబంధులముకామని, ఈ లోకంతో మాకు సంబంధంలేదని అంటూనే లోకమే నీచంగా చూసే కట్నం వైపు క్రైస్తవులెందుకు ఎగబడుచున్నట్లో? అప్పుడు వీరిలో లోకము ఉన్నట్లు కాదేమో? వీరు ఏమి మారుమనస్సు పొందినట్లో?

రీసెంట్‌గా ఒక ప్రధానమునకు పిలవబడ్డాము పెండ్లికుమారుని తరుపున వచ్చిన పాస్టర్ గారు ప్రధానం మెస్సేజీ మీరు చెయ్యండి అన్నాడు. నాకు తెలియదు అన్నాను. అదేమిటండీ! మీరు ఒక పత్రికా ఎడిటర్ + చాలాకాలం నుండి సేవచేస్తున్న సేవకులైయుండి ప్రధానం మెస్సేజీ తెలియదు అంటారేమిటి అన్నాడు. నిజంగానే నాకు తెలియదు అన్నాను. అయితే ఆదికాండం 24వ అధ్యాయం చదివి కొన్నిమాటలు+హెచ్చరికలు చెయ్యండి అన్నాడు.

ఆదికాండం 24వ అధ్యాయంలో అబ్రహాము, ఎలియాజరు, ఇస్సాకు, రిబ్కా మొ॥గు వారున్నారు. అబ్రహాము తనకు కాబోయే కోడలుకు తన ఆస్తిలో శ్రేష్టమైన నానావిధవస్తువులు తీసుకొని వెళ్ళి ఆమెకు ఇవ్వమని ఎలియాజరుతో చెప్పాడు. బంగారపు ముక్కుకమ్మి, రెండు బంగారు కడియములు ఇచ్చినట్లునూ వాటిని ఆమె తన సహోదరునికి చూపినట్లు 30వ వచనం ఋజువుచేస్తుంది. 53వ వచనంలో ఇంకా విలువైన వస్తువులు ఇచ్చినట్లు చూస్తాము. ఇవన్నీ అబ్రహాము ఆస్తికి సంబంధించినవి గాని అబ్రహాము రిబ్కా దగ్గర **"కట్నం"** తీసుకొని పంపించినవికావు అన్నాను. అబ్రహాము పంపిన వస్తువుల విషయంలో రిబ్కాగాని రిబ్కా తండ్రి సహోదరుడు గాని పేచీలు పెట్టలేదు. అన్యులు తగాదాలాడిన రీతిగా వారు వాటి విషయమై తగాదాలు ఆడలేదు. పెండ్లికొడుకుల తల్లిదండ్రులు పెండ్లికుమార్తెల దగ్గర **"కట్నాలు"** దొంగిలించి పంపించిన వస్తువుల కోసం పరిశుద్ధగ్రంధంలోని పవిత్రమైన వాక్యములను ముడిపెట్టి వీళ్ళకి ప్రసంగంచెయ్యాలా? పరిశుద్ధగ్రంధంలో కన్యకలకు ఓలి ఇచ్చి పెండ్లి చేసుకున్నారని ఉంది. పోని ఓలి యివ్వకపోగా, పైగా ఆడపిల్లల మీద బ్రతకటం విషయంలో సిగ్గులేని క్రైస్తవ జనాంగం చూపే క్రీస్తు నీతి ఇదేనా? మీ క్రీస్తు నేర్పిన నీతి ఇదేనా? అని ఎవరైనా అన్యుడు అడిగితే క్రైస్తవులు చెప్పే జవాబు ఏమైయుంది? అందుకే ఉన్నది ఉన్నట్లుగా బోధించెవాడు గాని, వాక్యమును సరిగా విభజించి బోధించే బోధకుడు గాని క్రైస్తవులకు అక్కరలెద్దు. పూత ప్రసంగాలు (యెహె 13:10) చేయడం నాకు అలవాటు లేదు. బైబిలు తీసుకుని పరిశుద్ధమైన లేఖనాలను అబద్ధికులకు ముడిపెట్టి వాక్యం చెప్పాలని ప్రజలుకోరుతున్నారు. అందుకే అబద్ధబోధకులు కోకొల్లలుగా ఉన్నారు.

– నేను చెప్పుమాటల ప్రకారము మీరు చేయక – సర్వాధికారి, సర్వాధికారి అని నన్ను పిలచుట ఎందుకు? ( లూకా 6:46) అని మెస్సీయ అడుగుచున్నాడు. మెస్సీయ చాలా ప్రేమామయుడు, చాలా దయామయుడు, చాలా కరుణామయుడు అని క్రైస్తవలోకం భ్రమపడుతుంది. ఆయన వచ్చి ధర్మశాస్త్రం కొట్టివేసాడని అబద్ధముల ప్రచారం చేసి ధర్మమే తెలియని పరిస్తితిని క్రైస్తవ బోధకులు క్రైస్తవులకు అందిచారు. అందుకే నీతికి – అవినీతికి తేడా తెలీయడంలేదు. ప్రజలకు విచ్చలవిడితనం అలవాటయ్యింది. – మెస్సీయ నిజంగా ప్రేమామయుడే అయ్యివుంటే ఆయన ప్రేమనే ప్రజలకు పంచినప్పుడు ఆయన బోధకు ఆనాటి ప్రజలు స్పందించిన వివరాలెలా ఉన్నాయో ఒక సారి చూడండి.

1. గనుక ఆ మాటకు ముఖము చిన్నబుచ్చుకొని దుఃఖపడుచు వెళ్ళిపోయెను. మార్కు 10:32, మత్తయి 19:22
2. ఆయన విషయమై అభ్యంతరపడిరి మత్తయి 13:56
3. పరిసయ్యులు ఆ మాట విని అభ్యంతరపడిరని – మత్తయి 15:12
4. ఆయనను ఎలాగు సంహరింతుమా అని ఆయనకు విరోధముగా ఆలోచన చేసిరి మత్తయి 12:14
5. వారాయనను అపహసించిరి మత్తయి 9:24
6. ఆయన సముద్రము మీద నడచుట శిష్యులు చూచి తొందరపడి, భూతమని చెప్పుకొని భయముచేత కేకలువేసిరి. మత్తయి 14:25
7. అలాగైతే ఎవడు రక్షణ పొందగలడు? మత్తయి 19:25
8. ఆయనను చంపవలెనని ఆయనను విరోధముగా అబద్ధసాక్ష్యము వెతుకుచుండిరి. మత్తయి 26:61
9. అధికారులకు అప్పగిస్తున్నారు. మత్తయి 27:1
10. ఆయన మతి చలించియున్నదని చెప్పి ఆయనను పట్టుకొనబోయిరి మార్కు 3:21.
11. తమ్మును గూర్చియే చెప్పెనని గ్రహించి, ఆయనను పట్టుకొన సమయము చూచుచుండిరి. మత్తయి 21: 45
12. అప్పుడు వారు వెఱ్ఱికోపముతో నిండుకొని, యషువను ఏమిచేయుదుమా అని ఒకరితోనొకరు మాటలాడుకొనిరి. లూకా 6:11
13. ఆ మాటలు విని ఆగ్రహముతో నిండుకొని, లేచి ఆయనను పట్టణములోనుండి వెళ్ళగొట్టి, ఆయనను తలక్రిందులుగా పడద్రోయవలెనని తమపట్టణము కట్టబడిన కొండపేటువరకు ఆయనను తీసుకొనిపోయిరి. లూకా 4:28,29.
14. ఆయన ప్రశ్నలకు సమాధానం చెప్పలేని స్తితిలో పడిపోయారు. మత్తయి 22:45,46.
15. ఆయన మీద నిందపగబట్టి ఆయన మీద నేరము మోపవలెననియుండి, ఆయన నోటనుండి వచ్చు ఏమాటనైనను పట్టుకొనుటకు పొంచి, వెదకుచూ చాలా సంగతులను గూర్చి ఆయనను మాటలాడింపసాగిరి. లూకా 11:54
16. వారాయనను పట్టి యీడ్చుకొనిపోయి ....లూకా 22:54
17. ఆయన మీద రువ్వుటకు రాళ్ళు ఎత్తిరి యోహాను 8:59
18. నీవు సమరయుడవు దయ్యము పట్టినవాడవు యోహాను 8:48
19. వాడు దయ్యము పట్టిన వాడు, వెఱ్ఱివాడు, వాని మాట ఎందుకు వినుచున్నారనిరి యోహాను 10:20
20. అయితే వారొకేపట్టుగా కేకలువేసి, వీనిని మ్రానుకువేయమని అడుగగా వారికేకలే గెలిచెను. లూకా 23:23.
21. మనస్సాక్షి చేత గద్దింపబడే మాటలు వ్రాసాడు. యోహాను 8:7–9

యషువ మెస్సీయ అబద్ధబోధకుల వలె పాలిష్ బోధ చెయ్యలేదు గనుక అందరికి మంచివాడు కాలేకపోయాడు. ఆయనను పోలినడిచిన అపోస్తులులందరూ ఆయన వలెనే బోధించారు. గనుక ఈ లోకానికి వారు పనికిరాలేదు. అందుకే నిజమైన యావెజనుడు అందరికీ మంచివాడు కాడు కాలేడు.

# సువార్తకు అడ్డుబండలు ఎవరు?

**నా పక్షమున నుండని వాడు నాకు విరోధి; నాతో కలిసి సమకూర్చనివాడు చెదరగొట్టువాడు** (మత్తయి 12:30, లూకా 11:23) అని మెస్సీయ అంటున్నాడు. సువార్తకు శత్రువు ఎవరు అనగానే సాతాను అని మనమంతా నెతుక్కోకుండా చెప్పేస్థాము కాని చూడండి సువార్తకు ఎవరు శత్రువులుగా ఉంటున్నారో?

1. ఒకసారి కొందరు చిన్నపిల్లలను యషువ మెస్సీయ నొద్దకు తీసుకువచ్చి వారిని దీవించాలని కోరినపుడు, యషువ శిష్యులు వారిని గద్దించి వెలపలకు పంపించెయ్యడాన్కి ప్రయత్నించారు. (మత్తయి 19:13–15, మర్కు 10:13–16, లూకా 18:15–17)

2. యషువ మెస్సీయ గొప్పసమూహము మీద కనికరపడి భోజనము పెడదామని ఆయన చూస్తుంటే ఆయన శిష్యులు వారిని పంపించెయ్యమని సలహా చెప్తున్నారు. (మత్తయి 14:14, 15, మార్కు 6:35, 36, లూకా 9:11,12)
3. యషువ మెస్సీయ తనకు కలుగబోయే శ్రమలను, హింసలను గూర్చి చెపుతుంటే కేఫా (పేతురు) తండ్రి చిత్తము నెరుగకుండా సాతాను ప్రేరేపణకులోబడి ఆయనను గద్దిస్తున్నాడు (మత్తయి 16:21–23, మార్కు 8:31–33).
4. రూపాంతర కొండదగ్గర దర్శనం చూసిన పేతురు ఇక్కడే ఉండిపోదాం నీకిష్టమైతే పర్ణశాలలు కడతాను అంటున్నాడు. (మత్తయి 17:3,4 మార్కు 9:5, లూకా 9:33) పేతురు ఏమిచెపుతున్నాడో తనకే తెలియదు.
5. యషువ మెస్సీయ నామంలో ఒకడు దయ్యములను వెళ్ళగొట్టుట చూచిన శిష్యులు, అతడు వారిని వెంబడించుటలేదని అతనిని ఆటంకపరుస్తున్నారు (మార్కు 9:38–40, లూకా 9:49–50).
6. యషువ మెస్సీయను చేర్చుకోవడాన్కి యిష్టపడని సమరయులను చూచి ఆకాశమునుండి అగ్నిదింపి నాశనంచేయడం నీకిష్టమా? అని ఆయనను శిష్యులు అడుగుతున్నారు (లూకా 9:52–55).
7. యషువ మెస్సీయ కోసం ఒక స్త్రీ అత్తరు తెచ్చి ఒక మంచి కార్యముచేయుచుండగా ఆయన శిష్యులు – ఈ నష్టమెందుకు అని కోపపడుచున్నారు (మత్తయి 26:6–13, మార్కు 14:3–9, యోహాను 12:3–8).
8. యషువ మెస్సీయ ఒక తల్లి చేసిన మనవికి ఎంతో మృదువుగా సమాధానం చెప్పి పంపించగా ఆయన శిష్యులు వారి మీద కోపపడుచున్నారు (మత్తయి 20:20–28, మార్కు 10:35–45).
9. యషువ మెస్సీయకు ఎదురైన సమస్యలలో ఆయన శిష్యులు కత్తి ఉపయోగించారు (మత్తయి 26:50,51, మార్కు 14:47) కత్తితో నరుకుదామా అని ఆయనను అడుగుతూనే కత్తితో ఒకని చెవిని నరికారు (లూకా 22:49–52).
10. అలాగైతే ఎవడు రక్షణ పొందగలడు? (మత్తయి19:25) అని రక్షకుడ్ని దగ్గర పెట్టుకుని అడుగుతున్నారు.

పైన చూపిన ఉదాహరణలన్నింటిలోనూ యషువ మెస్సీయ శిష్యులు యషువ మెస్సీయ ఆత్మను ఎరుగక, ఉద్దేశ్యమును ఎరుగక, గద్దించబడ్డారు. సిద్ధుడైన ప్రతివాడును తన బోధకునివలె ఉండును అని లూకా 6:40 చెప్తుంది. యషువ మెస్సీయ కూడానే ఉంటూ ఆయన మనస్సును, ఆయన ఆత్మను గ్రహించిన సిద్ధులైన శిష్యులు ఎక్కడ? ఆనాడు జరిగినదే ఈనాడు జరుగుతుంది.

అపోస్తలుల కాలంలో అపోస్తలులు యావెవాక్యము బోధించుటకే ఎక్కువప్రాముఖ్యత ఇచ్చి (అ॥కార్య 6:2) వాళ్ళ బాధలు వారు పడుతూవుంటే, శిష్యులు సంఖ్య విస్తరించి భోజనాలు దగ్గర విదవరాండ్రను చిన్నచూపు చూసిన సంగతులుపై సణుగులు వినబడ్డాయి (అ॥కార్య 6:1), ఏదో ఒక్కొక్కచోట ఏదో ఒకొక సమస్య తలెత్తుతూనే ఉంటుంది. ఈ సమస్యలు సువార్తకు అడ్డుబండలుగా తయారవుతున్నాయి. సమాజము చేసే శాపగ్రస్త పనులను బట్టి సమాజకాపరికి తలదించుకొనే స్తితి (యెహోషువా 7:10–12) ఏర్పడుతుంది. నాయకులను దుఃఖపరిచేస్తితిలో విశ్వాసులు ఉంటే వాళ్ళు వర్ధిల్లరు (హెబ్రీ 13:17) భోజనమును బట్టి ఎలోహీం పనిని పాడుచేయకండి (రోమా 14:20, హెబ్రీ 13:9) సువార్తకు అడ్డు బండలుగా జీవించకండి. సమస్య వచ్చినపుడు పరిష్కారం వెతుక్కొవడం పరమ తండ్రి బిడ్డల లక్షణమైయుండగా, వెనక్కి వెళ్ళిపోవడం లేదా విశ్వాసం వదులుకోవడవ అనునది సాతానుప్రేరేపణ. అపోస్తులుడైన సౌలు హెబ్రీయులకు చెప్తున్న మాటలను చదవండి (హెబ్రీ 10:32–39) నాగటి మీద చెయ్యిపెట్టి వెనక్కితిరిగి చూడకూడదు (లూకా 9:62). వెనుకున్న వాటిని మరిచి ముందున్న వాటికై వేగిరపడాలి (ఫిలిప్పి 3:13–15). ఐహిక విచారమువలన ధనమోసము వలన నిష్ఫలులము కారాదు (మత్తయి 13:22). శ్రమలు హింసలు కలుగగానే తొట్రిల్లిపోకూడదు (మత్తయి 13:21). అభ్యంతర పడిపోకూడదు సమస్యలకు ఎక్కువ ప్రాముఖ్యత యిచ్చి విశ్వాసమును పోగొట్టుకోకూడదు (హెబ్రీ 6:4–6). దేమా వలె (2.తిమోతి 4:10) లోకంలో కలసిపోకూడదు. సమస్యలను బూత అద్దాలతో చూసుకుంటూ సహవాసమును, సహోదరులను విడిచిపోకూడదు (2.తిమోతి 4:16). ఈ విశ్వాస జీవితంలో ఎక్కడో ఏదో ఒక సమస్య తలెత్తుతూనే ఉంటుంది.

అయితే, అపోస్తలుడైన సౌలువలె మనం చెప్పగలిగే స్తితిలో ఉండాలి. దయతో ఈ వచనాలు చదివి. (రోమా 8:35–39) మన మనస్సులను స్తిరపరచుకుందాం.సువార్తకు అడ్డుబండలుగా ఉండకుందుము గాక! **సమస్య వచ్చినపుడు పరిష్కారం వెతుక్కొవడం పరమతండ్రి బిడ్డల మంచి లక్షణం.**

# బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము

**బ్రదర్ పి.రాజు**

**బాలుడు నడువ వలసిన త్రోవను వానికి నేర్పుము. వాడు పెద్దవాడైనప్పుడు దానినుండి తొలగిపోడు. సామె 22:6.** సర్వశక్తిమంతుడైన యావె సమస్త మానవాళికి రెండు మార్గాలు తెలియజేసి వాటిలో మనకు నచ్చినదానిని ఎన్నుకునే అవకాశం మనకేవదిలిపెట్టాడు అవి 1. జీవం 2. మరణం. జీవంలో ప్రవేశింపగోరిన యెడల ఆజ్ఞలు పాటించాలి మత్తయి 19:17. ఆజ్ఞాతిక్రమమే పాపం. పాపం వలన వచ్చు జీతం మరణం. మనకు మన పిల్లలకు నిత్యం క్షేమం కలగాలంటే ఆయన మనకిచ్చిన కట్టడలను, ఆజ్ఞలను గైకొనవలెను. ఆ ఆజ్ఞలను, కట్టడలను మన కుమారులకు అభ్యసింపచేయాలి అనేది ఆయన మనకిచ్చిన ఆజ్ఞ ద్వితీ 6:7. ఈ విధంగా మన కుమారులకు సర్వశక్తుని యొక్క ఆజ్ఞలను, కట్టడలను నేర్పిస్తే అవి వారి లేత మనసులలో నాటుకొని పోయి, వారు పెద్ద వారైనప్పుడు వాటిని అనుసరిస్తూ పాపము చేయకుండా జీవిస్తారు అనేది పరమతండ్రి యొక్క ఉద్దేశ్యం.

ఇప్పుడు మనమేం చేస్తున్నాం? ధర్మశాస్త్రం కొట్టివేయబడినది, దానిని పాటించనక్కర లేదు కేవలం విశ్వాసం ఉంచితేచాలు అని సామాన్య విశ్వాసుల దగ్గర నుండి దేశవిదేశాలలో బహుబలంగా వాడబడుచున్న బోధకుల వరకు నమ్ముతున్నారు. ఈ విధంగా బోధించడం వల్ల హత్యలు చేయవచ్చుని, దొంగతనం, వ్యభిచారం ఇలా అన్ని చేయవచ్చని బోధించునట్లవుతుంది. ఇది లోకం యొక్క చట్ట ప్రకారమే నేరమైనపుడు, తండ్రి దృష్టికి నేరము చేసినట్లు కాదా? ఈ విధంగా ఆయన ఆజ్ఞలను అతిక్రమించడం వల్ల బోధకులైన వారు, వారిని వెంబడించే విశ్వాసులు నరకానికి పోవడాన్కి రిజర్వేషన్ చేసుకుంటున్నారు.

ఇశ్రాయేలీయులు తమ కుమారులకు పరమతండ్రి నియమించిన నియామక కాలముల యొక్క ప్రాముఖ్యతను గురించి చెపుతారు. ఇశ్రాయేలీయులు మొట్టమొదటి నెలయైన నీసాన్/అబీబు నెలలో 14 వ తేదీ సాయంకాలం నుండి ఆరంభమయ్యే పస్కాపండుగయొక్క ప్రాముఖ్యత గురించి వారి కుమారులకు వివరిస్తారు. **కాబట్టి మీరు నిరంతరం మీకును, మీకుమారులకును దీనిని కట్టడగా ఆచరింపవలెను (నిర్గమ 12:24).** సర్వశక్తిమంతుడు సమస్తమానవాళికి తనను ఆరాదించడాన్కి కొన్ని దినములు నియమించాడు. వాటిని ఎప్పుడు, ఏవిధంగా ఆచరించాలో లేవీకాండం 23వ ఆధ్యాయంలో వివరంగా వ్రాయబడినవి. ఆదినములను సర్వశక్తిమంతుడు ఆశీర్వదించి వాటిని పరిశుద్దపరచెను. (నిర్గమ 20:8–11) కాని లోకం ధర్మశాస్త్రం గురించి పట్టించుకోకపోవడంవల్ల ఆనియామక కాలములు వదిలేసి వేరే రోజులలో ఆయనను వ్యర్ధంగా ఆరాధించుచున్నారు. విశ్రాంతి నెలపొడుపు దినాలు, పర్ణశాల, పస్కా, పెంతెకోస్తు, పండుగదినాలు సర్వశక్తుని యొక్క నియామక కాలములు అయితే పరిశుద్ధ గ్రంధంలోలేని, ఆది అపోస్తలులు ఆచరించని ఆదివారం, క్రిస్మస్, గుడ్‌ఫ్రైడ్, ఈస్టర్, కొత్త సంవత్సరం అంటూ వాటిని ఆచరించుచున్నారు. వాటిని వారికుమారులకు అభ్యసింపచేస్తున్నారు. తద్వారా ఆశీర్వాదాన్ని పరిశుద్ధతను పొందలేకపోవుచున్నారు.

ప్రపంచదేశాలలో నేరాల సంఖ్య నానాటికి అధికం అగుచున్నది. లోకంలో శాంతి కరువైపోయింది. గతంలో ప్రపంచంలో శాంతి నెలకొల్పడానికి **"నానాజాతి సమితి"** అనే దానిని ఏర్పాటు చేసారు. దానివల్ల ప్రయోజనం కలగక దాన్ని రద్దుచేసి **"ఐక్యరాజ్యసమితి"** ఏర్పాటు చేసారు. దానివల్ల ఏమిప్రయోజనం కలగడంలేదు. అమెరికా వియత్నాం యుద్ధం, ఇండియా–చైనా, ఇండియా–పాకిస్తాన్ యుద్దాలు, ఇరాక్–ఇరాన్ యుద్ధాలు, అమెరికా–ఇరాక్ యుద్ధం, అమెరికా–ఆఫ్గనిస్థాన్ యుద్ధం లేటెస్ట్‌గా జరుగుచున్న అమెరికా–ఇరాక్ యుద్ధం ఇలా భూమి మీద యుద్దాలు జరుగుతూనేవున్నాయి. కరువులు, భూకంపాలు, తుఫానులు లేటెస్ట్‌గా సునామీలు ప్రజలను కబలిస్తున్నాయి. కాబట్టి ఇటువంటి వ్యర్ధ ప్రయత్నాలు మాని యావె యందు భయభక్తులు కలిగి ఆయన ఆజ్ఞలను కట్టడలను పాటించినట్లయితే భూమిమీద శాంతి సమాధానాలు వెల్లివిరుస్తాయి.

మనం, మన పిల్లలు, వారి పిల్లలు ఈ విధంగా తరతరాలు క్షేమంగా, ఆరోగ్యంగా, దీర్ఘాయువు కలిగి జీవించడాన్కి కావలసినవన్ని సర్వశక్తుడైన యావె ధర్మశాస్త్రంలో పొందుపరిచాడు. సామెతలు 3:1,2 అందుకే భక్తుడైన దావీదు ధర్మశాస్త్రం నందు ఆనందించుచూ దివారాత్రములు దానిని ధ్యానించువాడు ధన్యుడు అని చెప్పాడు. ఆయన కుమారుడు సొలోమోన్ ప్రసంగి 12 వ అధ్యాయంలో యావె యందు భయభక్తులు కలిగి ఆయన కట్టడలను, ఆజ్ఞలను అనుసరించి నడుచుకొను చుండవలెను. ఇదియే మానవకోటికి విధి అని పేర్కొనడం జరిగింది. ఈయన ఆజ్ఞలు కట్టడలు పాటించడం వల్ల కలిగే మేలులు పాటించకపోవడం వల్ల కలిగే శాపములకు ద్వితీయోపదేశకాండం 28వ అధ్యాయం చాలా స్పష్టంగా పేర్కొనడం జరిగింది. కాబట్టి మీరు ఈలోకం జీవించినంతకాలం అనేకమైన మేళ్ళు పొందడానికి ఆ తరువాత నిత్యజీవంలో ప్రవేశించడానికి ఆయన మనకిచ్చిన ఆజ్ఞలను, కట్టడలను పాటించడం **"తండ్రి ఏదిచేయుట చూచునో కుమారుడు దానినే చేయును"** అన్న వాక్య భాగం అనుసరించి తండ్రులైన మీరు ఆయన ఆజ్ఞల ప్రకారము నడిస్తే మీకుమారులు కూడా ఆమార్గంలో నడుస్తారు. ఆవిధంగా చేయుటకు సర్వశక్తిమంతుడైన యావె మీకు చూడగల కన్నులను, వినగల చెవులను, గ్రహించగల హృదయమును మీకు అనుగ్రహించును గాక.



**ఆదిఅపోస్తలుల బాప్తిస్మము ననుసరించి అ॥కార్య॥ 2:38 యషువ మెస్సీయ నామములో బాప్తిస్మము ఇచ్చుట**